సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 19 । జనవరి । 2025



వైభవంగా భారీజం పండగ

గిరిజనుల ఆచార, సంప్రదాయంలో భాగమైన భారీజం పండగను శనివారం వనుగుపల్లిలో ఘనంగా నిర్వహించారు. పలు దేవతామూర్తులు, అడవి జంతువులు, ఆదివాసీల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, సతీమణి శివరత్నం గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేశారు.

8లో

న్యూస్‌రీల్

అదిగో పులి.. పుకార్లతో బెంబేలు

- భయాందోళనలో సీలేరు వాసులు

సీలేరు: పులి సంచారంపై జరుగుతున్న ప్రచారం సీలేరు వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. సప్పర్ల అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా పెద్దపులి కనిపించడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చడం తెలిసిందే. ఈనేపథ్యంలో సీలేరు ఫారెస్టు డిపోలో పులి కనిపించిందని జరుగుతున్న ప్రచారం స్థానికులు భయాందోళనకు గురి చేసింది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా సీలేరు ఫారెస్టు డిపోలో పులి కనిపించిందని కొంతమంది ప్రయాణికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ డిపో పరిసరాలను పరిశీలించారు. అయితే పులికి సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని రేంజ్ అధికారి వెంకట్రావు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 1923 మంది హాజరు

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్: నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు తెలిపారు. పాడేరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహణను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ ఆరవ తరగతిలో ప్రవేశానికి పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 3156 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 1923 మంది ప్రవేశ పరీక్ష రాశారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్. శశికుమార్ పాల్గొన్నారు.

డీలర్ పోస్టుల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

- పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

పాడేరు రూరల్: డీలర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన పరీక్ష నిర్వహించే కేంద్రాన్ని సందర్శించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు రాత పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రం వద్ద రావాలని సూచించారు. ఆయన వెంట పరిపాలనాధికారి చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

భద్రతతోనే ప్రమాదాల నివారణ

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



చింతూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: ప్రయాణంలో భద్రత పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లను పీవో శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భద్రత నియమాలు పాటించాలని, ప్రమాదాలు కొనితెచ్చుకోవడం ద్వారా కుటుంబాలకు దూరమవుతారని సూచించారు. వాహనాలు నడిపేవారంతా అన్ని ధృవపత్రాలు కలిగివుండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చింతూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బండారు చెల్లారావు పాల్గొన్నారు.

రబ్బరు రైతుకు ఉపాధి ఊతం

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని రబ్బరు సాగు చేపట్టే రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఈ సాగు లాభదాయకం అయినా తగిన ప్రోత్సాహం లేక రైతులు నిరాశకు గురయ్యేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు రంపచోడవరం ఐటీడీఏ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి ప్రోత్సహిస్తోంది. ఎకరా విస్తీర్ణంలో మొక్కల సంరక్షణకు ఒక **రైతుకు నాలుగేళ్ల కాలానికి రూ.1.40 లక్షల చొప్పున చెల్లించేలా చర్యలు చేపట్టింది.**



మారేడుమిల్లిలో రబ్బరు తోటలు



రబ్బరు చెట్టు నుంచి పాల సేకరణ

- **ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను అనుసంధానం చేసిన రంపచోడవరం ఐటీడీఏ**
- **సాగు చేపట్టేందుకు ముందుకు వస్తున్న అన్నదాత**
- **ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 500 హెక్టార్లలో నాటేందుకు కార్యాచరణ**
- **ఇప్పటికే 146 హెక్టార్లలో ప్లాంటేషన్ పూర్తి**
- **పదేళ్ల క్రితం నాటిన గిరి రైతులకు మంచి ఆదాయం**



రైతులు తయారు చేసిన రబ్బరు షీట్లు

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు రబ్బరు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వీరికి రంపచోడవరం ఐటీడీఏతోపాటు కేరళలోని రబ్బరు బోర్డు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. సాగుకు ఈ ప్రాంతం అనుకూలమని మూడు దశాబ్దాల క్రితమే రబ్బరు బోర్డు గుర్తించింది. అప్పట్లో గిరిజన రైతులతో మొక్కలు నాటించింది. ఇందుకు అవసరమైన రబ్బరు ప్లాంటేషన్‌ను మారేడుమిల్లి ప్రాంతంలో అభివృద్ధి చేసింది.

- 1994 నుంచి 1999 వరకు దేవరపల్లిలో 50 హెక్టార్లు, 1998 నుంచి 2013 వరకు పూజారిపాక, వేటుకూరుల్లో 45 హెక్టార్లు, 2008 నుంచి 2013 వరకు 100 హెక్టార్లలో రబ్బరు మొక్కలను నాటించి తోటలను అభివృద్ధి చేసింది. నాటిన దగ్గర నుంచి నాలుగేళ్ల వరకు మొక్కల సంరక్షణకు అవసరమైన ఆర్థిక సహకారం అందించింది. అప్పట్లో నాటిన రైతులంతా ప్రస్తుతం మంచి ఆదాయం పొందుతున్నారు. ఆ తరువాత కాలంలో రంపచోడవరం ఐటీడీఏ భారీస్థాయిలో రబ్బరు మొక్కల పెంపకం చేపట్టినా సరైన ఫలితాలు రాకపోవడంతో దాని ప్రభావం సాగు విస్తీర్ణంపై చూపింది. ఈ నేపథ్యంలో తాజాగా రంపచోడవరం ఐటీడీఏ, రబ్బరు బోర్డు సంయుక్తంగా రబ్బరు సాగుపై దృష్టి సారించాయి. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతులకు వివరిస్తూ పెంపకం చేపట్టేలా అవగాహన కల్పిస్తున్నాయి.

రంప ఐటీడీఏ కార్యాచరణ

రబ్బరు సాగు విస్తరణకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాచరణ రూపొందించింది. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి గిరిజన రైతులను పోత్సహిస్తోంది. ఈమేరకు గతేడాది 375 ఎకరాల్లో రబ్బరు మొక్కలను గిరిజన రైతులు నాటుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రంపచోడవరం, వై.రామవరం ఎగువ ప్రాంతం, మారేడుమిల్లి మండలాల్లో 500 హెక్టార్లలో రబ్బరు మొక్కలు నాటించేలా ఐటీడీఏ ప్రణాళిక రూపొందించింది. దీనిలో ఇప్పటికే 146 హెక్టార్లలో గిరిజన రైతులు మొక్కలు నాటారు.

నిధుల కేటాయింపుతో ఆసరా

సంరక్షణకు కేటాయించే ఉపాధి నిధులతో ఆసరా పొందుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో రబ్బరు సాగు చేపడితే ఒక రైతుకు నాలుగేళ్ల కాలానికి రూ.1.40 లక్షలు చెల్లిస్తోంది. మొక్కలు నాటేందుకు, గోతులు తీసినందుకు, పొలం చుట్టూ కంచె ఏర్పాటుకు, ప్రతిరోజు మొక్కలకు నీరు పోత, పురుగు మందులు, ఎరువుల వినియోగానికి ఈ నిధులు వెచ్చిస్తోంది. దీని వల్ల రైతులకు మొక్క నాటిన దగ్గర నుంచి నాలుగేళ్ల వరకు ఆర్థిక ఆసరా లభిస్తోంది. మొక్కలను కూడా రబ్బరు బోర్డు కేరళ నుంచి ఉచితంగా పంపిస్తోంది.

ఆన్‌లైన్‌లో ధరను బట్టి అమ్మకాలు

గిరిజన రైతులు ఆన్‌లైన్ ధరను బట్టి రబ్బరు షీట్లను విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ పరంగా కూడా రబ్బరుబోర్డు సహకారం అందిస్తోంది. ఇప్పటికే రబ్బరు రైతులంతా రబ్బరు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడ్డారు. కేరళలోని రబ్బరు బోర్డు ఆన్‌లైన్‌లో ధరను ప్రకటిస్తుంది. దీని ఆధారంగా బోర్డు గుర్తింపు పొందిన డీలర్లు కొనుగోలు చేపడతారు. ఆన్‌లైన్‌లో ధర ఆధారంగా స్టాక్‌ను బట్టి డీలర్ ఆయా సంఘాల ఖాతాల్లో ముందుగానే నగదు జమ చేస్తారు. ఆ తరువాత రబ్బరు షీట్లను 50 కిలోలు ఒక బండిల్‌గా కట్టి తీసుకువెళ్తారని సాగు రైతులు తెలిపారు.

నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు



పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో 50 వేల రబ్బరు మొక్కల ఉత్పత్తికి సంబంధించి నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకంలో కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తుంది. నర్సరీ ఏర్పాటు అయితే గిరిజన రైతులకు ఎంతో ప్రయోజనకరం. తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేసేందుకు కేరళ నుంచి మొక్కలు రప్పించాల్సి ఉంటుంది. స్థానికంగా నర్సరీ ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరం.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, కేవీకే కోఆర్డినేటర్, రంపచోడవరం

ఈ ఏడాది రూ.8 లక్షల ఆదాయం



మారేడుమిల్లి మండలం పీఎంకోట గ్రామానికి చెందిన ఈ రైతు పేరు కత్తుల సోమిరెడ్డి. ఈయన ఐదు ఎకరాల్లో సుమారు 1200 రబ్బరు మొక్కలను 2008లో నాటారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు సేకరించిన పాలు ఆధారంగా తయారు చేసిన రబ్బరు షీట్ల ద్వారా రూ.8 లక్షల ఆదాయం పొందినట్టు ఆయన తెలిపారు. అప్పటిలో నాటిన రైతులంతా ఇలా నిలకడగా ఆదాయం పొందుతున్నారు.

పాల నుంచి రబ్బరు షీట్ తయారీ ఇలా..

రబ్బరు చెట్ల నుంచి పాలను ఒక క్రమ పద్ధతిలో గిరిజన రైతులు సేకరిస్తారు. సూర్యోదయానికి ముందే రబ్బరు చెట్లకు కత్తితో గాటు పెడతారు. వాటి నుంచి సుమారు 4 గంటల పాటు పాలు వస్తాయి. ఇలా రోజు విడిచి రోజు పాలను సేకరిస్తారు. ఒకొక్క చెట్టు నుంచి వయసును బట్టి రోజుకు 300 ఎంఎల్ నుంచి 600 ఎంఎల్ వరకు పాలు వస్తుంటాయి. ఒక లీటరు రబ్బరు పాలకు లీటరు నీరు కలుపుతారు. ఇలా తయారు చేసిన మిశ్రమాన్ని అల్యూమినియం ట్రేల్లో ఉంచుతారు. దీంట్లో 200 ఎంఎల్ పరమిక్ యాసిడ్ కలపడంతో మరుసటి రోజుకు గడ్డకడుతుంది. వీటిని రోలింగ్ మెషీన్ ద్వారా షీట్ తయారుచేస్తారు. వీటిని స్మోక్ రూమ్‌లో నాలుగురోజులపాటు ఉంచడంతో లేత తేనెరంగులోకి మారుతాయి. వీటిని రబ్బరు బోర్డు ఆమోదం పొందిన డీలర్లకు విక్రయిస్తారు.



రబ్బరు మొక్కలు నాటుకున్న గిరిజన రైతులతో రబ్బరు బోర్డు అధికారులు

నిండు గర్భిణి నరకయాతన

అంబులెన్సు సమకూర్చమంటే చుక్కలు చూపించిన వైద్య సిబ్బంది

- వైద్యం అందుబాటులో లేక అష్టకష్టాలు
- ఆస్పత్రికి విద్యుత్ సదుపాయం లేదన్న కిల్లోగుడ పీహెచ్‌సీ సిబ్బంది
- అరకు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచన
- కనీసం అంబులెన్సునైనా సమకూర్చాలని ప్రాధేయపడిన కుటుంబసభ్యులు
- డీజిల్, డ్రైవర్ లేరన్న సాకుతో నిరాకరణ
- అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం చొరవతో ఆటో సమకూర్చిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు
- ఎట్టకేలకు ఆస్పత్రికి తరలింపు
- కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యంపై విమర్శలు



శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు సమకూర్చిన ఆటోలో గర్భిణి సునానిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంద గ్రామానికి చెందిన నిండు గర్భిణి పాంగి సువాని(30) శనివారం రాత్రి నరకయాతన అనుభవించింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అయితే అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో సుమారు 25 కిలోమీటర్ల దూరంలోని కిల్లోగుడ పీహెచ్‌సీకి ఆటోలో వ్యయ ప్రయాసలకు గురై తీసుకువచ్చారు. విద్యుత్ సదుపాయం లేనందున ప్రసవం చేయడం కష్టమని, వెంటనే ఆరకులోయ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సిబ్బంది కుటుంబసభ్యులకు సూచించారు.అక్కడికి తీసుకువెళ్లేందుకు కనీసం అంబులెన్సునైనా సమకూర్చాలని సిబ్బందిని కుటుంబ సభ్యులు ప్రాధేయపడ్డారు. డీజిల్, డ్రైవర్ లేరని కారణం చూపిస్తూ అంబులెన్సును సమకూర్చలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పి. నరసింగరావు స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు వెంటనే ఆటోను సమకూర్చడంతో గర్భిణిని అరకు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఏజెన్సీలోని ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఘటన ప్రత్యక్షసాక్ష్యంగా నిలుస్తోందని పలువురు విమర్శించారు.

ప్రొటోకాల్ రగడ



బల్క్ డ్రగ్ ఏర్పాటు విరమించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం
- మద్దతు తెలిపిన పలువురు జెడ్పీటీసీలు
- కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం
- నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటాం: జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హెచ్చరిక
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభ కార్యక్రమాలు, శంకుస్థాపనలకు తమకు ప్రాధాన్యం ఇవ్వకపోవడమే కాకుండా ఎలాంటి ఆహ్వానాలు అందడం లేదని పలువురు జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ప్రొటోకాల్‌పై వాడీవేడిగా చర్చ జరిగింది. ఇటీవల అనంతగిరి మండలంలో రోడ్డు శంకుస్థాపన సందర్భంగా నియోజకవర్గ శాసనసభ్యునిగా తనకు ఎలాంటి ఆహ్వానం లేదని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమా అని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం నిలదీశారు. కొంతమంది అధికారులు టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు కప్పుకుని తిరుగుతున్నారని విమర్శించారు. ఇలా వారి జెండాలను మోస్తూ ప్రజలతో ఎన్నుకోబడిన తన లాంటి ప్రజా ప్రతినిధులను అవమానపరుస్తున్నామని ధ్వజమెత్తారు. ప్రజలతో ఎన్నుకున్న ఎమ్మెల్యేలను కాదని కూటమి నాయకులతో పనులు ప్రారంభించడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ఈ రోడ్డు శంకుస్థాపనకు స్థానిక ఎంపీపీ అయిన తనకు ఆహ్వానం అందలేదన్నారు. కొంతమంది అధికారుల తీరు సరిగ్గా లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం మారగానే కొంత మంది అధికారుల తీరులో కూడా మార్పు కనబడుతోందన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా నిబంధనల మేరకు పని చేయాల్సి ఉందన్నారు. కాని అధికారపార్టీ ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు చెప్పిన ప్రకారం అధికారులు పనిచేయడం సరికాదన్నారు. గ్రామసభ తీర్మానబ ప్రకారం పనులు చేయాలని, అలాగే మండలపరిషత్, జిల్లాపరిషత్‌లో ఆమోదం ప్రకారం పనులు చేయాల్సి ఉందన్నారు. కాని ఇక్కడ ఎలాంటి తీర్మానాలు లేకుండా పనులు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. ఇక నుంచి ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ కొంత మంది అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయకపోవడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కక్షసాధింపు అన్యాయం

పింఛనుదారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అన్యాయమని గొలుగొండ జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు అన్నారు. వారిని ఇబ్బందులు పెట్టేలా సర్వేలు, సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం, దీనికి అధికారులు వంత పాడుతున్నారన్నారు.

మిగతా 8వ పేజీలో ▶

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధన

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

సాక్షి,పాడేరు: అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆయన ప్రారంభించారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్వచ్ఛ దివాస్‌పై స్థానిక ప్రజాప్రతినిధులు, పలుశాఖల అధికారులు, ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు.సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రిసైక్లింగ్ చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో ప్లాస్టిక్ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. అనంతరం సమీపంలోని రైతు బజార్ వద్ద చెత్త, కాల్వల్లో పూడికను తొలగించే పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కె.శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పాడేరు పాతబస్టాండ్ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ

కలెక్టరేట్‌లో స్వచ్ఛ దివాస్

స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛ దివస్‌ను నిర్వహించారు. డీఆర్వో పద్మలతతో పాటు అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు చెత్తను తొలగించారు.సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయం వెనుక పేరుకు పోయిన చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలను డీపీవో గోవిందరాజులు, డీపీఆర్వో రాములు, సిబ్బంది తొలగింపు చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ సందర్భంగా శనివారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా వుంటాయని, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఎంపీడీవో చైతన్య, ఎఫ్‌ఆర్‌వో అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ చిరంజీవి, ఈవో ఆర్డీ మోహనరావు పాల్గొన్నారు.




చింతూరు బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో అపూర్వభరత్

ఆంధ్రా ఊటీకి పర్యాటకుల తాకిడి

ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీ అరకులోయకు పర్యాటకుల తాకిడి కొనసాగుతోంది. సంక్రాంతి పండుగ దగ్గర నుంచి పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గిరిజన మ్యూజియం, మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలన్నీ కిటకిటలాడుతున్నాయి. శనివారం గిరిజన మ్యూజియం సందర్శనకు భారీగా పర్యాటకులు తరలివచ్చారు. జిప్ లైన్, స్కై సైక్లింగ్, బోటు షికారు చేస్తూ సందడి చేశారు. భోగి పండగ నాడు పిల్లలు, పెద్దలు కలిపి 26,956 మంది సందర్శించగా ప్రవేశరుసుం ద్వారా రూ.16 లక్షల 81 వేల 760 ఆదాయం వచ్చిందని మేనేజర్లు ఫణికుమార్, శారద తెలిపారు.

– అరకులోయ టౌన్





ప్రొటోకాల్ రగడ

▶7వ పేజీ తరువాయి అధికార పార్టీకి ఇలాంటి చర్యలు సరికాదని పలువురు జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు.

బల్క్ డ్రగ్ వద్దు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురు అవడమే కాకుండా మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు ఆవేదన వ్యక్తంచేశారు.బల్క్ డ్రగ్ ఏర్పాటును విరమించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు.

అంకిత భావంతో పనిచేయాలి: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు, జెడ్పీ సర్వసభ్య సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్థిక ప్రణాళికలు, తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్, వ్యయాలను సభ్యుల ఆమోదంకోసం ప్రవేశపెట్టామన్నారు. జెడ్పీకి సంబంధించి భవనాలు, అతిథి గృహాలు, దుకాణాలు, స్థలాల అభివృద్ధిపై సూచనలు, సలహాలు సభ్యుల నుంచి కోరారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు సభ్యులను తీసుకు


సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, ఎమ్మెల్సీలు

వెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీకి సంబంధించి 19 అతిథి గృహాలు ఉన్నాయని, వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తామన్నారు. నిర్వహణకు ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆదాయ వనరులు పెంచుకునేలా సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.1589కోట్ల 13లక్షల 81వేల 635, అంచనా వ్యయం రూ.1586కోట్ల 08లక్షల, 58వేల 235కు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీడీ విజయకుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా భారీజం పండగ


వనుగుపల్లిలో భారీజం పండగకు వచ్చిన గిరిజనులు


థింసా నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

- డప్పు వాయిద్యాల హోరు
- తరలివచ్చిన గిరిజనం


థింసా నృత్యం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జికె వీధి జెడ్పీటీసీ శివరత్నం దంపతులు

సాక్షి, పాడేరు: గిరిజనుల ఆచార, సంప్రదాయ భారీజం పండగను శనివారం పంచాయతీ కేంద్రమైన వనుగుపల్లిలో ఘనంగా నిర్వహించారు. గిరిజనులంతా పలు దేవతామూర్తులు, అడవి జంతువులు, పురాతన ఆదివాసీల వేషధారణతో ఆకట్టుకున్నారు. థింసా నృత్యాలతో సందడి చేశారు. గిరిజన డప్పు వాయిద్యాలు హోరెత్తాయి. గ్రామదేవత శంకులమ్మతల్లికి గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దంపతులకు ఘన సన్మానం

భారీజం పండగకు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు,జి.కే.వీధి జడ్పీటీసీ కిముడు శివరత్నం దంపతులు హాజరవ్వడంతో మరింత సందడి నెలకొంది. ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అతని భార్య శివరత్నంలు థింసా నృత్యం చేశారు. ఈ పండగకు విచ్చేసిన గిరిజనులందరికి ఎమ్మెల్యే భారీజం పండగ శుభాకాంక్షలు తెలిపారు.


ఆదివాసీ తెగల వేషాల్లో గిరిజన యువకులు


కార్టూన్ క్యారెక్టర్ వేషధారణలో యువత

బుడియాల సందడి



వేషధారణలో చిన్నారులు వరుణ్‌తేజ్, లలిత్

జి.మాడుగుల: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండంనాయుడుకు చెందిన ఇద్దరు తనయులు సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం బుడియా వేషధారణలో సందడి చేశారు. ఏజెన్సీ గిరిజన ఆచార, సంప్రదాయం ప్రకారం సంక్రాంతి సంబరాలు వారం రోజుల నుంచి రెండు వారాలు నిర్వహించటం ఆనవాయితీ. ఇందులో భాగంగా జి.మాడుగులలో వరణ్‌తేజ్, లలిత్ అనే ఇద్దరు చిన్నారులు లవ,కుశ వేషధారణలో అందరిని అలరించారు. గ్రామంలో తిరుగుతూ బుడియాల సందడి చేశారు.

రైల్వే తత్కాల్ టికెట్ కౌంటర్ పునరుద్ధరణకు కృషి


ఎంపీపీ బందం శ్రీదేవి

రంపచోడవరం: స్థానిక పోస్టాఫీసులో టెక్నికల్ సమస్యతో నిలిచిన రైల్వే తత్కాల్ టికెట్ కౌంటర్ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ బందం శ్రీదేవి తెలిపారు. కొన్నేళ్లుగా రంపచోడవరం పోస్టాఫీసులో అందుబాటులో ఉన్న తత్కాల్ టికెట్ సేవలు ఇటీవల నిలిచిపోయాయన్నారు. దీనిపై సంబంధిత పోస్టల్ అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. తత్కాల్ కౌంటర్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటే అందుకు అవసరమైన సహకారం అందిస్తామని వారికి హామీ ఇచ్చామన్నారు. తత్కాల్ కౌంటర్ ఏర్పాటు వల్ల ఏజెన్సీ వాసులకు ఎంతో ప్రయోజనం ఉందని ఆమె పేర్కొన్నారు.

ఆస్పత్రిలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, పాడేరు: ప్రభుత్వ జిల్లా సర్వజన ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో ఖాళీగా ఉన్న అయిదు టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 25వతేది లోగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు దరఖాస్తులను మెడికల్ కళాశాలలో స్వీకరిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య


కృష్ణకుమారి(ఫైల్)

పాడేరు రూరల్: తల్లిదండ్రులు మందలించారని ఓ విద్యార్థిని మనస్థాపనికి గురై బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ దీనబంధు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లంపేల గ్రామానికి చెందిన సురడ సన్యాసిరావు, కాసులమ్మ దంపతుల ప్రథమ కుమార్తె కృష్ణకుమారి(19) ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం చదువుతుంది. విద్యార్థిని కృష్ణకుమారి సాంబాబు అనే యువకుడితో ప్రేమ వ్యవహారం సాగిస్తుందని తెలుసుకున్న తల్లి తండ్రులు ఆమెను మందలించగా, దీంతో ఆమె గ్రామ సమీపంలో ఉన్న బావిలో శుక్రవారం రాత్రి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసిందన్నారు. సమాచారం తెలుసుకొని హుటాహుటిన గ్రామానికి వెళ్లి బావిలో తేలియాడుతున్న విద్యార్థిని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాంకేతికతతో ముందడుగు

- ఆ దిశగా న్యాయవ్యవస్థ ముందడుగు వేయాలి
- కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్
- సౌత్ జోన్–2 సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న కర్నాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అను శివరామన్

విశాఖ లీగల్: శరవేగంతో విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం న్యాయవ్యవస్థలో కూడా అభివృద్ధి చెందాలని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ అన్నారు. శనివారం మధ్యాహ్నం బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వకళా పరిషత్ కన్వెన్షన్ సెంటర్లో జాతీయ, ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన సౌత్ జోన్–2 సదస్సులో న్యాయస్థానాల్లో వాజ్యాల జాబితా అన్వేషణ, మినహాయింపు అన్న అంశంపై న్యాయ నిపుణులు ప్రసంగించారు. ఏడు రాష్ట్రాలకు చెందిన హైకోర్టు, జిల్లా కోర్టు, ఇతర కోర్టుల న్యాయమూర్తులు సదస్సుకు హాజరయ్యారు. సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి 25 మందికి పైగా న్యాయకోవిదులు పాల్గొన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక తీరు తెన్నులు–భవిష్యత్తులో మార్పులపై కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్ ప్రసంగించారు. డిజిటల్ సాంకేతికత న్యాయవ్యవస్థతో అనుసంధానం కావాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రతి రంగంలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేపథ్యంలో న్యాయస్థానాల్లో కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత చూపించాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా –సాధారణ మీడియాపై మధ్య సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఇటీవల కాలంలో ఈ మీడియాల వల్ల వస్తున్న సమస్యలను విశదీకరించారు. డిజిటల్ సంతకాలు నైపుణ్యం కలిగిన న్యాయవాదులు, న్యాయమూర్తులు రేపటి భవితకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. 2015 నాటికి సాంకేతికపరమైన అంశాలకు సంబంధించి ఓ పుస్తకంలో అంశాలను ఆమె వివరించారు.

న్యాయ స్థానాల్లో జవాబుదారీతనం కీలకం


మాట్లాడుతున్న న్యాయమూర్తి జస్టిస్ సి.ఎం.జోషి

న్యాయస్థానాల్లో జవాబుదారీతనం చాలా కీలకమైందని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, ఈ కోర్టుల పర్యవేక్షకులు జస్టిస్ కేపీ కురియన్ పేర్కొన్నారు. సాంకేతికత పేరుతో ముందుకెళుతున్న న్యాయస్థానాలు అంతర్గత మార్పులకు ముందడుగు వేయాలన్నారు. చలానా, ఫైన్ కేసులు సైతం విపరీతమైన జాప్యానికి ఎవరు కారణమనేది ప్రశ్నించుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ప్రత్యామ్నాయ పరిష్కార వివాద యంత్రాంగ సేవలను పొందాలని కూడా సూచించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఇటీవల కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరిగిన ఈ కోర్టుల విధానాన్ని వివరించారు. వర్చువల్ విధానంలో కేసులు విచారణకు కేరళ హైకోర్టు తీసుకున్న చర్యలను జస్టిస్ కురియన్ వెల్లడించారు. కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది. 30 మంది హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ జూనియర్ సివిల్ జడ్జిలు, మేజిస్ట్రేట్లు, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరినాథశర్మ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పాల్గొన్నారు.

వీడీవీకేల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం:ఏజెన్సీలో వన్‌ధన్ వికాస కేంద్రాల (వీడీవీకే) సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక వైటీసీలో శనివారం వీడీవీకే సభ్యులు, ఐకేపీ అధికారులు, సిబ్బందితో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 114 వన్‌ధన్ వికాస కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో సంఘానికి వివిధ రకాలైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసుకునేందుకు రూ.15 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఏజెన్సీలో లభ్యమయ్యే జీడిపిక్కలు, జాఫ్రా,కొండచీపుర్లు, చింతపండు, పసుపు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ చేసి జీసీసీ ద్వారా మార్కెటింగ్ జరుగుతుందన్నారు. నాలుగు పీవీటీజీ వన్‌ధన్ వికాస కేంద్రాల గ్రూపులకు కావాల్సిన మిషనరీ కొనుగోలు చేసి ఇస్తామన్నారు. వీడీవీకేల్లో సభ్యులను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ దేగలయ్య, డీపీఎం అపర్ణ, పరమేశ్వరరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి ఇంటర్న్‌షిప్

సీతంపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వచ్చే ఐదేళ్లలో సుమారు కోటి మందికి పైగా యువతకు ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు స్టైఫండ్ చెల్లిస్తుందన్నారు. కంపెనీలో చేరేముందు ఇచ్చే రూ.6 వేలు వన్‌టైం గ్రాంట్ కూడా యువతకు ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంటుందని, ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఆసక్తి గల వారు పీఎంఇంటర్న్‌షిప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494202677, 9848438254 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కోదండ రామునాయుడు (ఫైల్)

కశింకోట:మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో కుంచ కోదండ రామునాయుడు(40) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అందిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. డ్రైవర్ పని కోసం అక్టోబర్ 29న ఇంటి వద్ద చెప్పి రామునాయుడు బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి కుంచ పెద్ద జోగునాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వణికిస్తున్న శీతల గాలులు

- డుంబ్రిగుడలో 7.1 డిగ్రీల నమోదు
- మన్యంలో కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు


పాడేరులో చలిమంట కాగుతున్న గిరిజనులు


అరకులోయలో ఉదయం 10 గంటల సమయంలో కురుస్తున్న పొగమంచు


చింతపల్లిలో భారీగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. డుంబ్రిగుడలో అత్యల్పంగా 7.1 నమోదు అయిందని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని అరకులోయలో 7.6, హుకుంపేటలో 9.1, జి.మాడుగులలో 9.4, ముంచంగిపుట్టులో 9.7.పెదబయలులో 9.7, పాడేరులో 10.3, అరకులోయలో 10.6, అనంతగిరిలో 10.8, గూడెంకొత్తవీధిలో 11.7, కొయ్యూరులో 12.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శనివారం నమోదైనట్టు ఆయన పేర్కొన్నారు. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు ఉదయం 9గంటల తరువాత సూర్యోదయం అవుతోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి వీస్తున్న శీతల గాలులకు అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

ఆస్వాదిస్తున్న పర్యాటకులు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీ అరకులోయలో చలితీవ్రత పెరుగుతోంది. దీనివల్ల ఘాట్‌రోడ్డులో ప్రయాణం చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత సందర్శనకు వచ్చే పర్యాటకులు మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో ఆదాయం బాగుందని హోటళ్లు, లాడ్జీలు, రిసార్ట్సులు, ఆటోలు, కార్ల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు: సీలేరులో శనివారం 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి.

కానిస్టేబుల్ పరీక్షలకు 336 మంది హాజరు


నియామక ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శరీర దారుఢ్య పరీక్షలకు శనివారం 336 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి రోజు 600 మందికి పరీక్షలు కోసం అధికారులు హాల్‌టికెట్లు పంపించారు. వారిలో శనివారం 264 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. హాజరైనవారికి వారికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించామన్నారు. ఆయా పరీక్షల్లో 256 మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారన్నారు. అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు బాలసూర్యారావు, కల్యాణి, మన్మథరావు, రామకృష్ణారావు తదితరుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

20, 21 తేదీల్లో జాబ్ మేళాలు

సీతంపేట: ఈ నెల 20వ తేదీన కంచరపాలెం ఎంప్లాయిమెంట్ కార్యాలయం, 21వ తేదీన పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 20న జరిగే జాబ్ మేళాలో బీ డేటా టెక్నాలజీస్, ఇండస్ బ్యాంక్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు, పేటీఎం కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8555868681 నంబర్‌లో సంప్రదించాలన్నారు. 21న పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో టావ్ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (యూస్ బేస్డ్ కంపెనీ), కెల్ గ్రూప్, టీమ్‌లీజ్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమా, బీటెక్ విద్యార్హత గల విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7702506614 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.